ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025

ఆడా.. ఈడా.. ఆయనే..!

డాక్టర్ హరీష్ డబ్బుల్ యాక్షన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రెండుచోట్ల ఉద్యోగాలు
- మూడేళ్లుగా కిమ్మనకుండా రెండు జీతాలు
- పర్యవేక్షణ అధికారుల తీరుపై విమర్శలు


అనంతపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ డాక్టర్ రెండు చోట్ల ఉద్యోగాలు చేస్తూ, రెండు చేతులా వేతనం తీసుకుంటుండటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రుల విభాగాలలోనే డ్యూటీలు చేస్తూ రెండుచోట్లా ప్రతి నెలా జీతం వేతనం తీసుకుంటున్నాడు. పర్యవేక్షణ అధికారులు ఇది తప్పని చెప్పకుండా నెలానెలా వేతనం చెల్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

డాక్టర్ డబుల్ యాక్షన్ ఇలా...

డాక్టరు హరీష్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టుగా పని చేస్తున్నాడు. ఈయన ఈ ఆస్పత్రికి రాకముందు జిల్లా ఆస్పత్రి ఆవరణంలో పీపీపీ విధానంలో అమలవుతున్న డయాలసిస్ విభాగంలో కిడ్నీ బాధితులకు వైద్యసేవలు అందించేవాడు. అప్పట్లో ప్రభుత్వంతో ఒప్పందం ఉన్న నెఫ్రోప్లస్ సంస్థ ఈ డాక్టర్ హరీష్‌ను కన్సల్టెంట్‌గా నియమించుకుంది. అక్కడ పని చేస్తుండగానే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ల నియామకానికి ప్రభుత్వం 2022లో దరఖాస్తులను కోరింది. ఆ సమయంలో నెఫ్రాలజీ డాక్టర్ పోస్టుకు హరీష్ దరఖాస్తు చేసుకున్నాడు. అర్హతలు ఉండటంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రాష్ట్ర ఆరోగ్యశాఖ నియమించింది. అప్పటి నుంచి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో నెఫ్రాలజీ డాక్టరుగా పనిచేస్తూ జీతం పొందుతున్నాడు.

అక్కడ పనిచేస్తూనే..

సాధారణంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగానే మరో ప్రభుత్వ ఉద్యోగం చేయడానికి వీల్లేదు. కానీ డాక్టర్ హరీష్ విషయంలో ఇది అమలు కాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రభుత్వ డాక్టరు పనిచేసే ఆస్పత్రులలోనే ఉంటూ వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. రాత్రి డ్యూటీ అయితే తెల్లారే వరకు ఉండాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ నెఫ్రాలజీ డాక్టరు హరీష్ ఉదయం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి అక్కడ ముఖహాజరు ఆన్‌లైన్‌లో వేసుకుంటున్నారు. ఆతర్వాత తనకు ఇష్టమున్నంతసేపు అక్కడ ఉండి, జిల్లా సర్వజనాస్పత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ విభాగానికి వస్తున్నట్లు సమాచారం. ఇక్కడ కూడా కింది స్థాయి సిబ్బందికి కొన్ని సూచనలు చేసి వెళ్లిపోతున్నట్లు తెలిసింది. అయితే డ్యూటీకి వచ్చినట్లు రిజిస్టర్‌లో సంతకాలు మాత్రం ఉంటాయి. దీంతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పని చేస్తున్నందుకు రూ.లక్షకుపైగా, డయాలసిస్ విభాగంలో పని చేస్తున్నందుకు రూ.70వేల వరకు ప్రతినెలా వేతనం పొందుతున్నాడు.



వైద్యాధికారుల తీరుపై విమర్శలు

డాక్టరు హరీష్ డబుల్ యాక్షన్‌ను పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాల్సిన వైద్యాధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డాక్టర్ల జీతాలకు సంబంధించి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చూసుకుంటారు. ఆయన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో డ్యూటీ చేస్తున్నారా? ముఖ హాజరు వేస్తున్నారా? అని పరిశీలించి వేతనాల బిల్లులు పెట్టి ఆమోదం వేసి పంపుతారు. సూపర్‌స్పెషాలిటీ, జిల్లా సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు డ్యూటీకి వచ్చారా? సమయపాలన పాటిస్తున్నారా? ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అని సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ ఈపర్యవేక్షణ అధికారులు మూడేళ్లుగా నిద్రపోయినట్లు ఉన్నారు. ఆడాక్టరు డబుల్ యాక్షన్ చేస్తూ జీతాలు తీసుకుంటున్నా ఎందుకు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఓవ్యక్తి ఫిర్యాదుతో డబుల్ యాక్షన్ డాక్టరు బండారం బయటపడింది. దీంతో వైద్యాధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు పంపించాం



నెఫ్రాలజీ డాక్టరు హరీష్ వ్యవహారంపై ఫిర్యాదు వచ్చింది. ఆయన రెండు చోట్ల పని చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఇది సర్వీస్ మేటర్ కావడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పరిధిలో ఉంటుంది. అందుకే ఈ డాక్టరు వ్యవహారం ప్రిన్సిపాల్‌కు పంపించాం. అక్కడ శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

- డాక్టరు వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఊరికి ఉపకరించేలా...

- ఉపాధి పనుల్లో కొత్త పుంతలు
- వ్యక్తిగత, సామాజిక పనులకు ప్రాధాన్యం
- గ్రామాల్లో కొత్తగా 94 పనుల గుర్తింపు



ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు, గ్రామాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవకతవకలకు అవకాశం ఉండే పనులను పక్కన పెట్టి రైతులకు లబ్ధి చేకూర్చే, గ్రామాభివృద్ధికి దోహదం చేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకోసం 94పనులు గుర్తించారు. సర్పంచ్, సీనియర్ కూలీలతో వేసిన గ్రామ కమిటీలు, గ్రామ సభల ద్వారా పనులకు అంచనాలు రూపొందించనున్నారు.

నకిలీ మస్టర్లకు చెక్

ఉపాధి పనుల ద్వారా చెరువుల్లో పూడికతీత, కందకాల తవ్వకాలు చేపడుతూనే వ్యవసాయం, రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ రైతులకు వ్యక్తిగతంగా మేలు చేకూరే పనులు గుర్తించనున్నారు. పండ్లు, పూల తోటల పెంపకం, (మిగతా 6వ పేజీలో..)

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుల పంట

6

పుట్టపర్తిలో మోసగాళ్లు

విదేశీయులు, ఎన్ఆర్ఐల డబ్బుతో ఆస్తుల కొనుగోలు

- కొన్నేళ్ల తర్వాత సొంతం చేసుకుంటున్న వైనం
- స్వచ్ఛంద, విద్యాసంస్థల ముసుగులో మాయ
- పుట్టపర్తి ప్రతిష్ట దెబ్బతీస్తున్న కేటుగాళ్లు
- కేసు పెడితే పోలీసుల పంట పండినట్లే



పుట్టపర్తిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో కొందరు మాయగాళ్లు విదేశీయులను, ఎన్ఆర్ఐలను మోసం చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. సత్య సాయి భక్తుల ముసుగులో విదేశీయులను నమ్మించి, బుట్టలో వేసుకుని తమపేర్లతో భారీగా ఆస్తులు సంపాదించుకుంటున్నారు. ఆపై అడ్డగోలు వ్యవహారాలు నడిపి విదేశీయులను ముంచేస్తున్నారు. అమెరికాకు చెందిన ఓ మహిళను పుట్టపర్తికి చెందిన సత్యనారాయణరాజు అనే వ్యక్తి (మిగతా 6వ పేజీలో....)

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- అర్జీలను సకాలంలో పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రజల నుంచి వచ్చే పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున కలెక్టర్‌కు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాఫిర్యాదుల వేదికలో స్వీకరించిన అర్జీలను అధికారులు నిర్దేశించిన గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయితో పాటు మండల, గ్రామ స్థాయి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. తాను క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినప్పుడు పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కారం కాలేదని ఎవరైనా అర్జీదారుడు తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత ఉద్యోగులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. 490 దరఖాస్తులు స్వీకరించామన్నారు. సమస్య పరిష్కారంలో వీఆర్వో, గ్రామ కార్యదర్శులకు ఏమైనా సమస్యలు ఎదురైతే తహసీల్దారు, ఎంపీడీఓలను సంప్రదించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను కలెక్టర్, జేసీ, ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు రామసుబ్బయ్య, అరుణకుమారి, సుమంత్, రామసుబ్బారెడ్డి, నరేష్‌రెడ్డి, శైలజ, అశోక్‌కుమార్, ఈబీ దేవి, వెంకటేశ్వర్లు, రూప్లానాయక్, ఓబులు, సలీంబాష, జహీర్ అస్లాం, పాల్‌రవికుమార్, సత్యనారాయణచౌదరి, స్థానిక తహసీల్దారు ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

భారీగా వనమహోత్సవం

- 5న పంపనూరులో కార్యక్రమం
- ఒకేరోజు 50వేల మొక్కలు నాటిస్తాం
- స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్



గురుప్రభాకర్

అనంతపురం న్యూటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఈనెల 5వ తేదీన వడ్డుపల్లి బీట్‌లోని పంపనూరు నగరవనంలో భారీ ఎత్తున వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులను ఆహ్వానించామని అన్నారు. రెగ్యులర్ డీఎఫ్ఓ విఘ్నేష్ సెలవులో వెళ్లారని, ఇన్‌చార్జ్ బాధ్యతలు కర్నూలు డీఎఫ్ఓ శ్యామలకు అప్పగించారని తెలిపారు. ఆ జిల్లాలో కూడా కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని, రెండు ప్రాంతాల్లో పర్యవేక్షణ ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో సీఎఫ్ యశోదాబాయి తనకు వనమహోత్సవం నిర్వహణ బాధ్యతలు అప్పగించారని వివరించారు. ఆ మేరకు వనమహోత్సవం పూర్తయ్యే వరకు స్థానికంగా ఉండి తగిన చర్యలు చేపడతామని అన్నారు. 2.5 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. 5వ తేదీ పంపనూరు నగరవనంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా 400 మొక్కలు నాటించేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. అదే రోజు సిబ్బంది ద్వారా అన్ని ప్రాంతాల్లో 50వేల మొక్కలు నాటిస్తామని చెప్పారు.

తీరనున్న బెంగ..!

అనంతపురం - బెంగళూరు మధ్య రైలు

- జిల్లా కేంద్రం నుంచి బయల్దేరే తొలి బండి
- రేపు ప్రారంభించనున్న ఎంపీ అంబికా

7

ప్రహరీ శిథిలం.. నిధులు పదిలం..!

- నిధులు ఉన్నా నిర్మాణానికి ఆటంకాలు
- గత పాలకవర్గం నిర్లక్ష్యం
- అనంత మార్కెట్ యార్డుకు ముళ్లకంపలతో రక్షణ

దెబ్బతిన్న యార్డు ప్రహరీ




అనంతపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నిధులు ఉన్నా.. టెండర్ల ప్రక్రియ పూర్తయినా ఓ వ్యక్తి అడ్డుపడడంతో అనంత మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గత పాలకవర్గంలో కీలకమైన ఓ కీలక వ్యక్తి స్వార్థంతో మార్కెట్ యార్డు ప్రహరీ నిర్మాణం కాగితాలకే పరిమితమయింది. నిధులున్నా వినియోగించని దుస్థితి నెలకొంది. అప్పట్లో పాలకవర్గంలోని ముఖ్యుడు యార్డులోని ఓ అభివృద్ధి పనికి సంబంధించిన కాంట్రాక్టు తమకు దక్కలేదన్న నెపంతో ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్నాడు. యార్డులో పలు అభివృద్ధి పనులకు మూడేళ్ల కిందట నిధులు మంజూరయ్యాయి. యార్డు ముందు భాగంలో 41 వాణిజ్య దుకాణాల నిర్మాణానికి రూ.2.25 కోట్లు, ఎదురుగా హైవేకి ఆనుకుని ఉన్న స్థలంలో మరో 30 షాపు రూముల నిర్మాణానికి రూ. 1.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలు జరిగి ఉంటే మార్కెట్ కమిటీకి అద్దెల రూపంలో నిధులు సమకూరేవి. పశువుల సంతలో బహిరంగ ప్రదేశంలో సిమెంట్ కాంక్రీట్ పనులు నిమిత్తం రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు పూర్తయి ఉంటే పశువులకు అనుకూలంగా ఉండేది. గత పాలకవర్గం నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. మార్కెట్ యార్డు వెనుక భాగంలో ప్రహరీ పూర్తిగా ధ్వంసమయింది. ఏళ్ల క్రితం నిర్మించడంతో గోడ మొత్తం శిథిలమైపోయింది. చాలాచోట్ల కూలిపోయింది. దీంతో సంబంధిత అధికారులు ముళ్లకంపలను అడ్డు వేయించారు. పాతగోడను పూర్తిస్థాయిలో తొలగించి 230 మీటర్ల నూతన ప్రహరీ నిర్మాణానికి రూ.55 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిర్మాణ పనులు ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. కాంట్రాక్టు పనులు తమకు దక్కలేదన్న కోపంతో అప్పటి పాలకవర్గంలోని కీలక వ్యక్తి ఆ పనులకు ఆదిలోనే అడ్డుపడ్డాడు. దీంతో ప్రహరీ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పాలకులైనా యార్డులోని అభివృద్ధి పనులతో పాటు ప్రహరీ నిర్మాణంపై దృష్టి సాధిస్తే యార్డుకు ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు, వ్యాపారులకు మేలు చేకూరుతుంది.

కూలిన ప్రహరీ ప్రాంతంలో అడ్డువేసిన ముళ్ల కంపలు →



కొత్తగా టెండర్లు పిలుస్తాం



గతంలో ప్రహరీ నిర్మాణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేయలేదు. దీంతో టెండర్ రద్దయింది. తిరిగి టెండర్ నిర్వహణకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. తర్వాత కొత్తగా టెండర్లు పిలుస్తాం.

-గోవిందు, ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెట్ యార్డు

డాక్టర్ నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

- తేల్చిన విచారణ కమిటీ
- చర్యలకు సిఫార్సు

అనంతపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో శిశువుల మృతిపై విచారణ ముగిసింది. డాక్టర్ నిర్లక్ష్యంతోనే శివవు మృతిచెందినట్లు తేల్చారు. ఆ మేరకు చర్యలకు సిఫార్సు చేశారు. గతనెల 25వ తేదీన 'ఆస్పత్రిలో ఒకేరోజు ముగ్గురు శిశువుల మృతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ సీరియస్‌గా తీసుకుని, విచారణకు ముగ్గురు సీనియర్ వైద్యులతో కమిటీని నియమించారు. ఆ కమిటీ విచారణ పూర్తి చేసి, నివేదిక ఇచ్చిందని సోమవారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. వజ్రకరూరు మండలానికి చెందిన లక్ష్మీకాంతమ్మ కాన్పు సమయంలో డాక్టర్ల నిర్లక్ష్యంతోనే శిశువు మరణించినట్లు ఆమె భర్త.. ఆస్పత్రి ఆర్ఎంఓ రామకృష్ణకు ఫిర్యాదు చేశాడు. కాన్పు సమయంలో డ్యూటీలో ఉన్న గైనకాలజిస్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలేఖ స్పాట్‌లో లేరనీ, సరిగా స్పందించకుండా నిర్లక్ష్యం చూపారని విచారణలో తేలిందని సూపరింటెండెంట్ తెలిపారు. విచారణ కమిటీ నివేదిక మేరకు వైద్యురాలిపై శాఖాపరమైన చర్యలకు డీఎంఈకి సిఫార్సు చేసినట్లు ఆయన వెల్లడించారు. మిగతా ఇద్దరు శిశువులు మాత్రం అనారోగ్య కారణాలతో మరణించినట్లు తెలిపారు.

మృత్యుతీగలు..!

- ఇళ్లకు ఆనుకుని విద్యుత్ లైన్
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

రాప్తాడు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ కళాకారుల కాలనీలో ఇళ్లకు ఆనుకుని 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లకు ఆనుకుని లైన్ వెళ్లడంతో పలువురు తీగలు తగిలి, ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలనీలో దాదాపు 15 ఏళ్ల క్రితం ప్రభుత్వ స్థలంలో విద్యుత్ స్తంభాలు అమర్చి 11 కేవీ విద్యుత్ తీగలు లాగారు. ఆ తరువాత కొన్నేళ్లకు ఆ ప్రదేశంలో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వారు ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రదేశమంతా కాలనీగా ఏర్పాటైంది. కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ తీగలను అధికారులు పక్కకు మార్చలేదు. దాదాపు 20 ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళనలు చెందుతున్నారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా లైన్‌ను మార్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను పక్కకు మార్చాలని వారు కోరుతున్నారు.

బాలుడు బలి..

గతనెల 25న కాలనీలో సాకే జయకృష్ణ అనే బాలుడు మిద్దె ఎక్కి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి శరీరమంతా కాలి అక్కడికక్కడే మృతిచెందాడు. కొన్ని నెలల క్రితం కాలనీలో ఓ మహిళ మునక్కాయల కోసం చెట్టు ఎక్కి విద్యుత్ తీగలు తగిలి, షాక్‌తో తీవ్రంగా గాయపడింది.



ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు

విద్యుత్ తీగలు పక్కకు మార్చాలి



కాలనీలో మా ఇంటి మీద 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా 11 కేవీ విద్యుత్ తీగలు పక్కకు మార్చాలి.

- నాగరత్నమ్మ, కళాకారుల కాలనీ





“ఆగు హనుమా..!
నీ తల్లి సీతమ్మ పిలుస్తోంది..
అక్కడో అభాగ్యుడు
చింతాక్రాంతుడై కూర్చున్నాడు..
అలా పట్టించుకోకుండా వెళతావేం..?”

“అతనున్నది కలియుగం..
కూర్చున్న చోటు ద్వాపరయుగం..
మనదేమో త్రేతాయుగం..
వాళ్ల కలెక్టర్ గుత్తికి వెళ్లాడు..
వచ్చాక చూసుకుంటాడులే రామచంద్రా..”

గోడు

గోడపై రథమున్నది.. కృష్ణార్జునులు లేరు..!
యుద్ధాలను మాకు వదిలేసి
ఎటో వెళ్లిపోయారు.. అధికారుల్లాగా.. ప్చ్..!

బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన ఈ పెద్దాయన పేరు గన్నప్ప. కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక ఉంటుందని భావించి సోమవారం వచ్చాడు. కానీ గుత్తిలో ఉండటంతో కలెక్టర్ సహా అధికారులు అందరూ అక్కడికి వెళ్లారు. 'ఇల్లు అమ్ముకున్నాను. సమస్య ఉంది. కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చాను..' అని దిగులుగా చెప్పాడు. తెలియక జిల్లా కేంద్రానికి వచ్చే ఇలాంటివారికోసం ఒక అధికారిని ఇక్కడే ఉంచితే బాగుంటుంది. కలెక్టర్ ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

రేషన్ పంపిణీలో 'అనంత'కు
మూడో స్థానం



రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు

అనంతపురం టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపు వద్దే సరుకులు తీసుకోవడానికి లబ్ధిదారులు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత టీడీపీ పాలనలో అమలు చేసిన ఈ విధానాన్ని ఆదివారం నుంచి మళ్లీ ప్రారంభించారు. జిల్లాలో 1645 రేషన్‌షాపులలో సరుకుల పంపిణీకి యంత్రాంగం చర్యలు తీసుకుంది. అధికారుల లెక్కట ప్రకారం జిల్లాలో 6,66,300 రేషన్ కార్డులు ఉన్నాయి. రెండు రోజుల్లో 2,22,732 మంది కార్డుదారులు రేషన్ సరుకులు తెచ్చుకున్నారు. సరుకుల పంపిణీలో రాష్ట్రంలో అనంత జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు రాష్ట్రశాఖ వెబ్‌సైట్‌లో ఉంచారు.

అందరికీ సరుకులు: జేసీ

డీలర్ల నుంచి కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు డీలర్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. 15రోజులు పాటు సరకులు పంపిణీ చేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 58,390మంది కార్డుదారులు 65సంవత్సలుపైబడినవారు, దివ్యాంగులు ఉన్నారన్నారు. వీరందరికి ఇళ్లవద్దకే వెళ్లి డీలర్లు సరకులు ఇవ్వాలని జేసీ ఆదేశించారు.

కదిరిలో భారీ చోరీ

● పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ

కదిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని దత్తానగర్‌లో నివాసం ఉండే తెలుగు అధ్యాపకులు కవిత నివాసంలో భారీ చోరీ జరిగినట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి 11.30వరకు కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకున్నారు. తరువాత బెడ్ రూమ్‌లో నిద్రపోయారు. దొంగలు వారు నిద్రిస్తున్న బెడ్ రూమ్‌కాకుండా మరో బెడ్‌రూమ్‌కున్న గ్రిల్ కట్ చేసి, లోపలికి వెళ్లారు. బీరువాలను పగలకొట్టి పది తులాల బంగారం, నాలుగు కిలోల వెండివస్తువులు, దాదాపు రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినట్లు చెప్పారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకుల పంట

● జిల్లా విద్యార్థులకు ఆలిండియా స్థాయి ర్యాంకులు
● ఆకులేటి చందనకు 81,
● నితిన్ అగ్నిహోత్రికి 183వ ర్యాంకు
● ఓపెన్ కేటగిరీలో పలువురి సత్తా







81వ ర్యాంకు పొందిన ఆకులేటి చందన , 183వ ర్యాంకు సాధించిన భూపతి నితిన్ అగ్నిహోత్రి , ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి

అనంతపురం విద్య, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ) అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు ర్యాంకుల పంట పండింది. ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. సోమవారం జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాకు చెందిన ఆకులేటి చందన ఆలిండియా 81వ ర్యాంకు, భూపతి అగ్నిహోత్రి 360 మార్కులకు 264 మార్కులతో 183వ ర్యాంకు సాధించాడు. పలువురు విద్యార్థులు ఓపెన్ కేటగిరీలో ఐదు వేల లోపు ర్యాంకులు సాధించారు.

నారాయణ విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. టాప్ ర్యాంకులు పొందిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకట్రామిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బద్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థి భూపతి నితిన్ అగ్నిహోత్రి 183వ ర్యాంకు సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో విద్యార్థులు విశాల్ 3,946వ ర్యాంకు, భావన 10,899వ ర్యాంకు, మోక్షసాయిరెడ్డి 12,809వ ర్యాంకు, మహమ్మద్‌ఆసిఫ్ 16,099వ ర్యాంకు, సవిత్‌కుమార్‌రావు 16,884వ ర్యాంకు సాధించారని తెలిపారు. లోకేష్‌కుమార్ 114 ర్యాంకు (ఎస్సీ కేటగిరి), ప్రణయ్‌చౌదరి 5,499(ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్లు తప్పనిసరిగా వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రవిశంకర్, ఓబన్నగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల కోర్ డీన్ బద్రినాథ్, సిబ్బంది

తేజ విద్యార్థికి 81వ ర్యాంకు

తేజ జూనియర్ కాలేజ్‌లో చదివిన ఆకులేటి చందన 81వ ర్యాంకు సాధించడంతో డైరెక్టర్ తేజేశ్వర్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చందన 10వ తరగతిలో 560 మార్కులు సాధించిందన్నారు. తేజ కాలేజ్‌లో ఉచితంగా కోచింగ్ ఇచ్చామన్నారు. అధ్యాపకులు ఇచ్చిన బోధనాంశాలు, సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు అనిల్ కుమార్, సాయి చైతన్య, నేత్రా, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల కుమారుడికి 4,363 ర్యాంకు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉపాధ్యాయ దంపతుల కుమారుడు హార్తిక్‌రెడ్డి 4,363 ర్యాంకు పొందాడు. తల్లిదండ్రులు సూర్యప్రకాష్‌రెడ్డి, రామభారతి ఎస్‌జీ టీచర్లు. 1 నుంచి 10 వరకూ అనంతపురం, ఇంటర్ విజయవాడలోని శ్రీచైతన్యలో చదివాడు. కొడుకు పందిరిపల్లి హార్తిక్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

18.86 టీఎంసీలు..

తుంగభద్ర డ్యాంలో పెరుగుతున్న నీటి నిల్వ

20 వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, జూన్2(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ పెరుగుతూ వస్తోంది. సోమవారానికి 18.86 టీఎంసీలకు చేరింది. జలాశయం పరీవాహక ప్రాంతంలో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా చేరుతోంది. సోమవారం 20 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రావడంతో నీటి నిల్వ 18.86 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 1597.84 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటిమట్టం 1577.47 అడుగులు ఉండగా.. 3.360 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. ఈ ఏడాది జలాశయా నికి ముందస్తుగా వరద వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న

పరిటాల శ్రీరామ్



వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పరిటాల శ్రీరామ్, వడ్డే అంజినప్ప, చిలకం మధు

ధర్మవరం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషర్లను ఎదిరించిన యోధుడు వడ్డే ఓబన్న అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పుట్టపర్తి రహదారిలోని సిరికల్చర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శ్రీరామ్ సోమవారం ఆవిష్కరించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలతో కలిసి వడ్డే ఓబన్న పోరాటం చేశారన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం ప్రజల హృదయాల్లో వడ్డే ఓబన్న ఉంటారన్నారు. చదువులు లేకుండానే నగరాలను నిర్మించిన ఘనత వడ్డెర్లకే దక్కుతుందని కొనియాడారు. హక్కుల సాధన కోసం వడ్డెర్లు వేసే ప్రతి అడుగులో పరిటాల కుటుంబం అండగా ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్, వడ్డెర సంఘం ధర్మవరం అధ్యక్షులు డేరంగుల అంజి, నాయకులు పల్లపు రవీంద్ర, మంజుల నరేంద్ర, తోపుదుర్తి వెంకటరాముడు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో
మోసగాళ్లు

(5వ పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో మోసం చేసి రూ.12.5కోట్లు తీసుకుని మోసం చేశాడనే అభియోగంపై ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు ఒకటిరెండు బయటపడుతున్నాయి. కానీ చలామంది మాయగాళ్లు చాపకింద నీరులా తమ పని చక్కపెట్టుకుంటూ పుట్టపర్తి ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారు.

నమ్మకమే పెట్టుబడి

విదేశీయుల నమ్మకమే పుట్టపర్తిలోని మాయాగాళ్లకు పెట్టుబడిగా మారింది. అనేక సంవత్సరాల నుంచి సత్యసాయిబాబా దర్శనార్థం పుట్టపర్తికి వచ్చిన విదేశీ భక్తులు, ఎన్ఆర్‌ఐలకు ఈమోసగాళ్లు సహాయకులుగా దగ్గరై చిన్నచిన్న పనులు చేస్తూ వారిని నమ్మిస్తారు. ఆతరువాత విదేశీయుల డబ్బుతోనే అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్లు నటిస్తారు. విదేశీయులు తమ పేరుపై భారత దేశంలో ఆస్తులు కొనే అవకాశం లేకపోవడంతో ఈమోసగాళ్ల పేరుపైన ఆస్తులు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయిస్తారు. కొన్నేళ్లపాటు ఈతతంగా సాఫీగా సాగుతుంది. తరువాత ఈఆస్తులు తమ సొంత ఆస్తులుగా ప్రకటించుకుని, విదేశీయులను మోసం చేస్తారు. మరికొంతమంది విదేశీయులకు బినామీలుగా ఉంటామంటూ వారితో పెట్టుబడి పెట్టించి పొలాలు, భూములు,స్థళాలు కొనుగోలు చేయిస్తారు. ఆవి తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న తరువాత అసలు బుద్ధి చూపిస్తారు. తాము సొంతంగా ఈఆస్తులు కొనుగోలు చేసినట్లు అడ్డం తిరిగి విదేశీలును నిలువునా మోసం చేస్తారు. కొంతమంది మోసగాళ్లకు చదువురాకపోయినా, వివిధ భాషల్లో పట్టు ఉండటంతో వారి పనులు సాఫీగా సాగిపోతున్నాయి. విదేశీయులను మోసం చేసి ఆస్తులు కూడపెట్టుకున్నవారిలో పుట్టపర్తికి చెందిన పలువురు రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కూడా ఉండటం గమనార్హం.

కేసుపెడితే పోలీసులకు పండగే..!

పుట్టపర్తిలో మోసగాళ్ల బారిన పడి సర్వం పోగొట్టుకున్న విదేశీయులు, ఎన్ఆర్‌ఐలు పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులకు పండగ వచ్చినట్లే. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న మరుక్షణం నుంచే పోలీసులు హడావుడి చేస్తూ మోసగాళ్ల అంతు చూస్తామని బిల్డప్పులిస్తారు. వారిని నమ్మి, బాధితులు తమ బలహీనతలను కూడా వారికి చెప్పుకుంటారు. ఇదే అదునుగా పోలీసులు మీకు న్యాయం చేస్తాం, ఆస్తులు, తిరిగి ఇప్పిస్తామంటూ వారి నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తరువాత మోసగాళ్లను పోలీసులు పట్టుకుని తమ దారికి వచ్చేవరకు వేచి చూస్తారు. మోసగాళ్లతో ఒప్పందం కుదిరిన తరువాత వారి నుంచి కూడా పెద్ద మొత్తంలో సొమ్ము వసూలు చేస్తారు. ఆతరువాత ఇది సివిల్ వ్యవహార మని, కోర్టులో తెల్చుకోవాలని బాధితులకు చెప్పి చేతులు దులుపుకుంటారు. అవసరమైతే తూతూ మంత్రంగా కేసులు పెట్టి వదిలేస్తారు. గత కొన్నేళ్లుగా ఈవ్యవహారం పుట్టపర్తిలో సర్వసాధారణంగా జరుగుతోంది.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

● అమెరికాలో నివసిస్తున్న చెన్నైకి చెందిన ఓ ఎన్ఆర్‌ఐ పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఐదున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఎన్ఆర్‌ఐకి సంతానం లేకపోయినా, ఆయన కుమారుడే భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈమోసంపై ఆ ఎన్ఆర్‌ఐ పుట్టపర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసి, కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.

● పుట్టపర్తి విమానాశ్రయం, కమ్మవారిపల్లి గ్రామాల మధ్యలోని వై.జక్షన్ వద్ద 16 ఎకరాలను ఓ ఆయుర్వే వైద్యుడు ట్రస్టు పేరుతో కొనుగోలు చేసినట్లు విదేశీయులను నమ్మించి, తన పేరుపైన రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై 15 సంవత్సరాల క్రితం పుట్టపర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికి ఈభూమిని పలువురు రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్లాట్లు వేసి విక్రయించారు.

● పుట్టపర్తి గణేష్ సర్కిల్ సమీపంలో ఇటలీ మహిళను మోసగించి, రూ. ఐదుకోట్ల విలువ చేసే ఓ భవనాన్ని పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి తన పేరుపై రాయించుకున్నాడు.

●కర్నాటక నాగేపల్లి సమీపంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలను కబ్జా చేయడానికి కొంతమంది రాజకీయ నాయకులు విశ్వ ప్రయత్నం చేశారు. ఈపాఠశాలకు నిధులు సమకూర్చిన విదేశీ మహిళ, తీవ్రంగా ప్రతిఘటించడంతో కబ్జా విషయం తాత్కాలికంగా నిలిచిపోయింది.

● పుట్టపర్తి వివేకానంద రోడ్డులో కోల్‌కతాకు చెందిన ఓ ఎన్ఆర్‌ఐ మహిళ 20 సంవత్సరాల కిందట ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే ఆమె చనిపోయినట్లు కోల్‌కతా కార్పొరేషన్‌లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి పుట్టపర్తికి చెందిన ఓవ్యక్తి తనపేరుపై ఆ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్దిరోజుల తరువాత విషయం తెలుసుకున్న ఆ ఎన్ఆర్‌ఐ పుట్టపర్తికి వచ్చి ఆవ్యక్తిని నిలదీయగా, రిజిస్ట్రేషన్ రద్దు చేసుకుని, పలాయనం చిత్తగించాడు.

● జగరాజుపల్లిలో ఓ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు, విదేశీ నిధులతోనే ఏర్పాటు అయ్యాయి. రూ.కోట్లాది ఆస్తులు ఈస్వచ్ఛంద సంస్థ పేరుపై ఉన్నాయి. వీటిని స్వాహా చేయడానికి కూడా అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు.

ఊరికి ఉపకరించేలా...

(5వ పేజీ తరువాయి)

పంటనీటి కుంటలు, మినీగోకులాల నిర్మాణం, మామిడి మొక్కల చుట్టూ ట్రెంచ్‌లు తవ్వకం, కంపోస్ట్ పిట్‌లు, ఇంకుడు గుంతల పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైతులు తమ వ్యవసాయ భూముల్లో వీటిని చేపట్టొచ్చు. రైతులకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూర్చే పనులు కాబట్టి నకిలీ మస్టర్లకు సిబ్బంది సాహసించలేరని అధికారులు చెబుతున్నారు.

గ్రామాభివృద్ధికి ఊతమిచ్చేలా పనులు

ఉపాధి పథకం కింద గ్రామాభివృద్ధికి దోహదం చేసే పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. కొండలపై పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం, దేవాలయాల ప్రాంగణంలోని కోనేర్లు, దశాబ్దాల నాటి చెరువుల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. గిరిజన ప్రాంతాల్లో నీటి సంరక్షణకు స్ప్రింగ్ షెడ్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఉపాధి హామీ పథకంలో 266రకాల పనులను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. రాష్ట్రంలోని రైతుల అవసరాలు, సామాజికాభివృద్ధికి వీలున్న 94పనులతో ఓ జాబితాను రూపొందించారు. దీన్ని అన్ని గ్రామాల్లో ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయనున్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం..: సలీంబాషా, డ్వామా పీడీ



ఉపాధి పథకం కింద గ్రామాల అభివృద్ధికి శాశ్వతమైన పనులు చేపట్టాలి. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఉపాధి పథకం కింద వ్యక్తిగత, సామాజికాభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిదే. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, గ్రామ అవసరాల మేరకు మొత్తం 94 పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పనులు చేపట్టాలి. ఇందుకు అవసరమైన మేరకు క్షేత్రస్థాయిలో ఉండే ఉపాధి సిబ్బందికి ఆయా పనులు, సడలింపులపై శిక్షణ కూడా ఇచ్చాం. గ్రామాల్లో ఉపాధి పథకంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజలు ముందుకు రావాలి.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తాం : ఏపీ రైతు సంఘం

పెనుకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బలవంతపు భూసేకరణను ప్రతిఘటిస్తామని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అధ్యక్షతన హిందూపురం, లేపాక్షి, పరిగి పరిధిలోని చలివెందుల, రాచపల్లి, మలుగూరు, మీనకుంటపల్లి, కొండూరు, వడ్డిపల్లి, తిమ్మగానిపల్లి గ్రామాలకు చెందిన రైతులు బలవంతపు భూసేకరణ ఆపాలంటూ పెనుకొండలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకుండా, గ్రామసభలు నిర్వహించకుండా 80శాతం మంది రైతుల ఆమోదం లేకుండా బలవంతపు భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. పరిగి, హిందూపురం ప్రాంతాల్లో పరిశ్రమల పేరుతో భూములు సేకరించి ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి దశాబ్దాలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పైగ్రామాల్లో 1118మంది రైతుల నుంచి 2191ఎకరాల భూమిని దేనికోసం సేకరిస్తున్నారో చెప్పకుండా, గ్రామసభల్లో వివరించకుండా బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. బలవంతపు భూసేకరణలు ఆపాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలకు సన్నద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిద్దారెడ్డి, ఫకృద్దీన్, వేమారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బహుగ్రంథ రచయిత రమేష్ నారాయణ

పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విభిన్న అంశాలపై ప్రతిభావంతమైన రచనలు చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ బహుగ్రంథ రచయిత అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. విద్యావేత్త, రచయిత రమేష్‌నారాయణ రచించిన 'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని సోమవారం అశోక్‌నగర్‌లోని రహీమ్ ఖాద్రీ మసీదు ఆవరణలో ఎమ్మెల్యే దగ్గుపాటి, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫిల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, సాహిత్యం, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక రంగాలపై రమేష్ నారాయణకు లోతైన అవగాహన ఉందన్నారు. 75 సంవత్సరాల వయసులోనూ నిత్యచైతన్యశీలిగా సామాజిక బాధ్యతను నెరవేరుస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. సాయిబాబా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ సేవలందించారని గుర్తుచేశారు. వైజ్ఞానిక సామాజిక శాస్త్రాలు, సాహిత్య విమర్శ, తాత్విక, జానపద గ్రంథాలు, ఆధునిక తెలుగుకావ్యాలు, అనేక ఆంగ్ల అనువాదాలు, పాపులర్ సైన్స్ వ్యాసాలు, ఆకాశవాణి ప్రసంగాలు, అనంత జానపదగేయాల ఆంగ్లవాదం వంటి రచనలు రమేష్‌నారాయణ ప్రతిభకు నిదర్శనాలని కొనియాడాన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు కేఎం షఫివుల్లా, పలువురు ముతవల్లిలు పాల్గొన్నారు.



'మహ్మద్ రసూల్ వారి జీవిత చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

క్రైం కార్నర్

వివాహేతర బంధంతోనే హత్య

● భర్తను హత్యచేయించిన భార్య ● ముగ్గురు నిందితుల అరెస్టు



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తగులుతున్న భర్తను హత్య చేయించిన సంఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్పీ రత్న తెలియచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్సుహాల్‌లో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో కలిసి హత్యకేసు వివరాలను సోమవారం ఆమె వెల్లడించారు. ధర్మవరం రూరల్ మండలం పోతుకుంట గ్రామానికి చెందిన అల్లే మంజునాథ్‌కు రామగిరి మండలం పోలేపల్లికి చెందిన యమునతో 12 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బతుకు తెరువుకోసం పెనుకొండకు వెళ్లి మంజునాథ్ డ్రైవరుగా పని చేస్తూ జీవనం సాగించేవారు. ఈక్రమంలో తాగుడుకు అలవాటుపడ్డ మంజునాథ్ భార్య ప్రవర్తనపై అనుమానంతో తరచు గొడవ పడుతుండేవాడు. రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామానికి చెందిన సిద్దప్ప అలియాస్ సిద్దుతో మంజునాథ్ భార్య యమున వివాహేతర సంబంధం ఉండేది. ఈనేపథ్యంలో తమ బంధానికి అడ్డుగా ఉన్న భర్త మంజునాథ్‌ను చంపాలని యమున సిద్దప్పపై ఒత్తిడి చేసింది. దీంతో అతడు తన స్నేహితులు పరిగి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన నూర్ మహమ్మద్, పావగడ తాలూకా హుస్సేనాపురం గ్రామానికి చెందిన మదన్‌మోహన్, రొద్దం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మోహన్‌లతో హత్యకు పథకం రూపొందించాడు. ఆమేరకు గత ఏడాది ఏప్రిల్ 22న ధర్మవరం మండలం నాగలూరు వద్ద గల పెద్దవంకలోకి మద్యం తాగడానికి మంజునాథ్‌కు తీసుకెళ్లారు. అక్కడ అధికంగా మద్యం తాపించారు. ముందస్తు పథకం మేరకు పూర్తి మత్తులో ఉన్న మంజునాథ్ గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో హత్య చేసిన నిందితులను కనుగొన్నారు. పక్కా సమాచారంతో ఆదివారం సాయంత్రం పోతుకుంట గ్రామ శివాలయం వద్ద సిద్దప్ప, నూర్ మహమ్మద్, మదన్‌మోహన్‌లను అరెస్టు చేశారు. యమున, మోహన్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, రూరల్ ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది చత్రునాయక్, అనిల్‌కుమార్, బాలకృష్ణకు ఎస్పీ నగదు రివార్డులను అందచేసి అభినందించారు. సమావేశంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విదేశీయుడి మృతి


దేవిడ్విచ్ డెజినిస్ మృతదేహం

పుట్టపర్తి రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో భవనం పై నుంచి పడి బెలారస్ దేశస్థుడు డేవిడ్విచ్ డెజినిస్(38) మృతిచెందాడు. ఈ ఘటన పుట్టపర్తిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన అతని స్నేహితుడు మంజునాథ్, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపిన వివరాల మేరకు, డేవిడ్విచ్ తన భార్యతో గొడవ పడి భారతదేశానికి వచ్చాడు. పుట్టపర్తిలోని ప్రియాంక గెస్టుహౌస్ ఐదో అంతస్తులో మూడు నెలలుగా ఉంటున్నాడు. భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ, మానసిక వేదన అనుభవిస్తున్నాడు. నిరంతరం మద్యం సేవిస్తూ, మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తించేవాడు. ఈక్రమంలో మద్యం అతిగా సేవించి, ఆదివారం రాత్రి 9గంటల సమయంలో భవనం ఐదో అంతస్తు నుంచి కిందపడి మృతిచెందాడు. మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిపండ్ల కోసం వెళ్తే.. కొట్టారు..!

● పోలీసులు పట్టించుకోలేదు ● ఎస్పీకి బాధితుల ఫిర్యాదు


ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మామిడి పండ్ల కోసం వెళ్తే... తమపై దాడి చేశారనీ, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామానికి చెందిన హరిజన హేమలత సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. గత నెల14వ తేదీ తాను రాధమ్మ, తులసితో కలిసి మొక్కజొన్న తోటకు పని కోసం వెళ్లామని, ఆ సమయంలో పక్క పొలంలో ఉన్న మామిడి పండ్లు కోయడానికి వెళ్లామని తెలిపింది. ఆ సమయంలో పొలానికి చెందిన రామాంజనేయులు, అతడి కుమారుడు అనిల్, బావమరిది కిష్టప్ప తమపై కర్రలతో దాడి చేశారని ఆరోపించింది. ఈ ఘటనపై బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు చేశారన్నారు. ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపింది. వారు తమను చంపుతామని బెదిరిస్తున్నారనీ, తగిన న్యాయం చేయాలని కోరింది. నగరంలో రామ్మోహన్ అనే వ్యక్తి చిట్టీల పేరుతో డబ్బు ఇవ్వకుండా మోసం చేశాడని లక్ష్మీదేవి అనే మహిళ ఆరోపించింది. ఎస్పీని కలిసి సమస్య వివరించింది. తన లాంటి బాధితులు చాలామంది ఉన్నారని తెలిపింది. ఏడాదిన్నర క్రితం జరిగిన చోరీ కేసు నేటికీ ఛేదించలేదనీ, న్యాయం చేయాలని అనంతపురంలోని నాయక్‌నగర్‌కు చెందిన పార్థసారథి కోరారు. 2023 నవంబరు 12న తన ఇంట్లో 28 తులాల బంగారం పోయిందని, ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వివరించారు.

ఫిర్యాదిదారులు సంతృప్తి పడేలా పరిష్కారం చూపండి: ఎస్పీ

ఫిర్యాదిదారులు సంతృప్తి చెందేలా చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. పోలీసు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 103 వినతులు వచ్చాయి. వారితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

జవాన్ కుటుంబం భూమి కబ్జా

● కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయని వైనం
● జవాన్ సెల్ఫీ వీడియోతో కదిలిన యంత్రాంగం


పొలం వద్ద వివరాలు సేకరిస్తున్న అధికారులు

మడకశిర/అమరాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'సరిహద్దుల్లో దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్నాను. కానీ మా సొంతూరులో నా కుటుంబానికే రక్షణ లేకుండాపోయింది. మా మామకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. ఎప్పుడో ఏడాదికి ఒక సారి ఊరికి వచ్చి వెళుతుంటాను. అక్కడ మాకు అండగా ఎవరూ లేరు. పొలంలోకి వెళితే వృద్ధులైన మా అత్త, మామపై రాళ్లతో దాడి చేస్తున్నారు. గొడ్డలితో నరికేందుకు వస్తున్నారు. నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్పందించి మాకు న్యాయం చేయాలి' అని ఓ బీఎస్ఎఫ్ జవాన్ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తన ఆవేదన ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా చూడాలని ప్రజలకు విన్నవించారు. 'నేను జవాన్‌ను. నా పరిస్థితి ఇలా ఉంది అని చెప్పుకునేందుకు సిగ్గుగా ఉంది..' అని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలం ఉదుగూరు గ్రామానికి చెందిన నరసింహమూర్తి బీఎస్ఎఫ్‌లో జవానుగా పనిచేస్తున్నారు. జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన, సోమవారం ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తన భార్య తల్లిదండ్రులకు కొడుకులు ఎవరూ లేరని, వృద్ధాప్యంలో ఉన్న వారి బాగోగులను తానే చూసుకుంటున్నానని పేర్కొన్నాడు. వారి భూమిని కె.శివరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు ఆక్రమించుకున్నాడని, సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తే దాడి చేసేందుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వద్ద ఆ పొలం డి పట్టా, అడంగల్, వన్ బీ, కోర్టు ఆర్డర్ సహా అన్నీ ఉన్నాయని, నాగరాజు వద్ద ఎలాంటి డాక్యుమెంట్ లేకున్నా పొలంలోకి రానివ్వడం లేదని వివరించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

కదిలిన యంత్రాంగం


సెల్ఫీ వీడియోలో బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి

బీఎస్ఎఫ్ జవాన్ సెల్ఫీ వీడియోతో అధికార యంత్రాంగం కదిలింది. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు గ్రామానికి వెళ్లి విచారించారు. భూమి వివరాలను సేకరించారు. కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. తహసీల్దార్ లక్ష్మీనరసింహం, ఎస్ఐ ఇర్షాద్ బాషా, ఏఎస్ఐ రామాంజినేయులు క్షేత్రస్థాయికి వెళ్లారు. సర్వేయర్లు, సిబ్బందితో భూమికి కొలతలు వేశారు. 'జవాన్ నరసింహమూర్తి వాళ్ళ మామ కదిరప్పకు 1988లో ప్రభుత్వం డి.పట్టా ఇచ్చింది. సర్వే నంబర్ 336-6 34 సెంట్లు, 336-7 లో 50 సెంట్లు, 366-8లో 58 సెంట్లు 366-9లో 56 సెంట్ల భూమిని కేటాయించింది. ఈ భూమి కె.శివరం గ్రామ సమీపంలో ఉంది. సాగు చేసేందుకు వెళితే పక్క పొలానికి చెందినవారు అడ్డగిస్తున్నారు. దీంతో కదిరప్ప కోర్టుకు వెళ్లారు. కోర్టు.. జవాన్ మామకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ భూమిని జవాన్ మామ కదిరప్పకు మంగళవారం అప్పగిస్తాం. పోలీసు రక్షణ కల్పించి ఇబ్బంది లేకుండా చూస్తాం' అని తహసీల్దారు అన్నారు.

బోయరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

● పాతకక్షల నేపథ్యంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల దాడులు
● ముగ్గురికి గాయాలు


గాయపడిన మారుతి, లక్ష్మీదేవి, దాడిలో ధ్వంసమైన బైక్

యాడికి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో పాతకక్షల నేపథ్యంలో ఇరుపార్టీల వర్గీయులు ఘర్షణ పడ్డారు. దీంతో టీడీపీకి చెందిన లక్ష్మీదేవి, పెద్దరామకృష్ణ, వైసీపీకి చెందిన మారుతి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు సోమవారం ఉదయం బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద టీడీపీ వర్గానికి చెందిన కిషోర్ అనే యువకుడు స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి ద్విచక్రవాహనంలో గ్రామంలోకి వస్తుండగా వైసీపీకి చెందిన మారుతి ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొట్టాడు. ఈ సమాచారం అందుకున్న కిషోర్ సమీప బంధువులు సంఘటన ప్రదేశం వద్దకు వచ్చి మారుతిపై దాడిచేసి గాయపరిచారు. మారుతిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి అక్కడి నుంచి అనంతపురం తరలించారు. సోమవారం మధ్యాహ్నం సొంత పనులపై యాడికికి వెళ్లి బోయరెడ్డిపల్లికి తిరిగి వస్తున్న టీడీపీ వర్గీయుడు, కిషోర్ బంధువైన రాంమోహన్‌పై తిరుణాంపల్లి గ్రామ సమీపాన పెట్రోల్ బంకు వద్ద వైసీపీకి చెందిన ఓబులేసు, మంజునాథ్, రమేష్ దాడి చేశారు. తనపై జరిగిన దాడిని రాంమోహన్ గ్రామంలోని తమ బంధువులకు తెలిపాడు. దీంతో గ్రామంలో ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో లక్ష్మీదేవి, పెద్దరామకృష్ణ గాయపడ్డారు. గాయపడ్డవారిని తాడిపత్రికి తరలించారు. పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాలవారు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బోయరెడ్డిపల్లి గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సర్కిల్ సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. బందోబస్తు ఏర్పాటుచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లెక్సీ చించివేయడమే కారణమా..?

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిల పుట్టినరోజు సందర్భంగా బోయరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని వైసీపీ వర్గీయుడు మారుతి చింపాడని, అందుకే టీడీపీ వర్గీయులు ఆ యనపై ఆగ్రహంతో ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గొడవలు ఉన్నాయి. అప్పట్లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకు న్న సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యమే సోమవారం జరిగిన దాడులకు కారణమై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వివరాలు ఆరాతీసిన ఏఎస్పీ

బోయరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన దాడులపై సోమవారం రాత్రి తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి గ్రామానికి వెళ్లి వివరాలు ఆరాతీశారు. దాడుల నేపథ్యంలో గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


బోయరెడ్డిపల్లిలో దాడులపై ఆరాతీస్తున్న సీఐ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● గుత్తి కోట ఉత్సవాలకు రూ.50 లక్షల నిధులు
● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మారుతున్న వైవిధ్య జీవన శైలిలో ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చునని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని చారిత్రాత్మక గుత్తి కోట గుర్రపుశాల వద్ద సోమవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, జిల్లా అధికారులు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, తహసీల్దార్ ఓబులేసుతో పాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. ట్రెక్కింగ్ నిర్వహిస్తూ కోటపై గుర్రపు శాలకు చేరుకున్నారు. అక్కడ విశాలమైన మైదానంలో దాదాపు 1500 మందితో ఆయూష్ శాఖ యోగా గురువులు గురురాజారావు, కృష్ణవేణి యోగాసనాలు చేయించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో మలోల, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా, స్థానిక అధికారులతో కలిసి పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు యోగా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ట్రెక్కింగ్ చేయడం మధురానుభూతి ఇచ్చిందన్నారు. యోగా చేయడం వల్ల ఆహ్లాదకరంగా, సంతోషకరంగా ఉందన్నారు. గుత్తి కోటలో జనవరిలో జరిగే వారోత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. యోగాంధ్రకు హాజరైన వారికి గుత్తి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. యోగా గురువు కృష్ణయ్య, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌ను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంఈఓ రవినాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు చికెన్ శ్రీనివాసులు, కోనంకి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న బెంగ..!

● అనంతపురం, బెంగళూరు మధ్య రైలు
● జిల్లా కేంద్రం నుంచి బయల్దేరే తొలి బండి
● రేపు ప్రారంభించనున్న ఎంపీ అంబికా
● అనంతవాసుల ఆనందం



అనంతపురం న్యూటౌన్/గుంతకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లావాసుల కల నెరవేరింది. అనంతపురం మీదుగా ఎన్నో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ ఒక్కటీ అనంతపురం నుంచి మొదలవదు. దీంతో రైలు ప్రయాణికులు ముందుగానే స్టేషన్‌కు చేరుకుని, నిరీక్షించి, బండి రాగానే పరుగెత్తుకుంటూ ఎక్కేవారు. అనంతపురం నుంచే రైలు మొదలైతే బాగుండేదని జిల్లావాసులు కోరుకునేవారు. ఎట్టకేలకు అనంతవాసుల కల నెరవేరింది. అనంతపురం నుంచి ఓ రైలు బండి బయల్దేరనుంది. అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే మెయిల్‌లైన్ ఎలెక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ (మెము) రైలును ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటకు ప్రారంభించనున్నారు. పుట్టపర్తి, బెంగళూరు మధ్య నడిచే ఈ రైలును అనంతపురం వరకు పొడిగించారు. ఈ రైలును అనంతపురం నుంచి ప్రారంభించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తీవ్ర పోరాటం చేశారు. పలుమార్లు రైల్వే మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోరాట ఫలితంగా రైలును అనంత నుంచి ప్రారంభించేలా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో నగరం నుంచి మొదలయ్యే మొట్టమొదటి రైలుగా ఇది నిలువనుంది. అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లాలనుకునే రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉదయం పూట అవి కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లే ఉన్నాయి. వాటిలో జనరల్ బోగీలు తక్కువ. మధ్యాహ్న సమయంలో అవి కూడా లేవు. దీంతో ఇబ్బందులు పడేవారు. మధ్యాహ్న సమయంలో అది కూడా మెము రైలు బయల్దేరనుండడం ఎంతో ప్రయోజనకరమని జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్నం నుంచి..

అనంతపురం, బెంగళూరు మధ్య నడిచే (66560) మెము రైలును అనంత రైల్వేస్టేషన్‌లో ఈనెల 4న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లాంఛనంగా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటకి జెండా ఊపి ప్రారంభిస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా 2.10 గంటకు రైలు బయల్దేరుతుంది. ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం మీదుగా రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.66559) బెంగళూరులో ఉదయం 8.35 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.55కి అనంతపురం చేరుకుంటుంది.


మాట్లాడుతున్న ఏపీసీ శైలజ

ఉపాధ్యాయుడే భావితరాల రూపకర్త: ఏపీసీ

అనంతపురం విద్య, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే భావితరాల రూపకర్త ఉపాధ్యాయుడేనని అనంతపురం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు టర్ల్ మూడు రోజుల శిక్షణా తరగతులను నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఏపీసీ శైలజ, రాష్ట్ర పరిశీలకుడు సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఏపీసీ శైలజ మాట్లాడుతూ.. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గణితం, భాషలు బోధించే టీచర్లలో బోధనా సామర్థ్యాలు పెంచడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టీచర్లకు సూచించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 252 మంది టీచర్లు, 14 మంది రిసోర్స్ పర్సన్లు శిక్షణకు హాజరైనట్లు అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎంఈఓలు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా సాగిన ఏడీసీసీ బ్యాంకుకు కూటమి ప్రభుత్వం ఇటీవల చైర్మన్‌ను నియమించింది. సోమవారం ఉదయం ఏడీసీసీ బ్యాంకులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శుభముహూర్తంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా బాధ్యతలు చేపట్టారు. త్వరలో భారీ సభ నిర్వహించి ప్రజలు, టీడీపీ నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణితోపాటు పలువురు నాయకులు, మిత్రులు, బ్యాంకు అధికారులు.. కేశవరెడ్డికి అభినందనలు తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్..


బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం స్థానిక కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శుభముహూర్తంలో వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా బాధ్యతలు చేపట్టారు. త్వరలో భారీ సభ నిర్వహించి ప్రజలు, టీడీపీ నేతల సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామలింగారెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు, మిత్రులు, సిబ్బంది వెంకటేష్‌కు అభినందనలు తెలిపారు.

కొత్త ఏసీ, ఏడీ విధుల్లో చేరిక


ఏసీ వెంకటేశ్వర్లు, ఏడీ పఠాన్ మునీర్‌ఖాన్

అనంతపురం విద్య, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖకు బదిలీపై వచ్చిన అధికారులు సోమవారం విధుల్లో చేరారు. కడప జిల్లా నుంచి జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా వెంకటేశ్వర్లు, ఏడీగా పఠాన్ మునీర్ ఖాన్ వచ్చారు. వారిరువురు 1వ రోడ్డులోని శారదా స్కూల్‌లో ఉన్న డీఈఓ ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత విధుల్లో చేరారు. వారికి విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

చీనీ టన్ను రూ.30వేలు

అనంతపురంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తం 451 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

గొడ్డలి పోటు దినం జరుపుకోండి

● టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య విమర్శ


మాట్లాడుతున్న ఆవులక్రిష్ణయ్య

గార్లదిన్నె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు ఈనెల 4వ తేదీన చేపట్టనున్న వెన్నుపోటు దినంకు బదులు గొడ్డలిపోటు దినం జరుపుకోవాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ఖండించారు. ఎవరికి ఎవరు వెన్ను పోటు పొడిచారన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. అధికారం దాహం కోసం సొంత బాబాయినే గొడ్డలితో చంపించి గుండెపోటుగా చిత్రీకరించిన జగన్ నోట వెన్ను పోటు వినడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం కోసం చిన్నాన్నను హత్య చేయించి...ఆస్తి కోసం తల్లిని, చెల్లిని రోడ్డున పడేసిన జగన్‌దే వెన్ను పోటు అని అన్నారు. సొంతవారినే దగా చేసిన జగన్‌ను నిలదీయాలని వైసీపీ నాయకులకు సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను జిల్లాకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం జవహర్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేఎస్ జవహర్‌కు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న పెద్దన్న, రాయాలసీమ జిల్లా ల అధ్యక్షుడు రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కదిరప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురం క్రైం,జూన్2(ఆంధ్రజ్యోతి): టౌన్ ప్లానింగ్ అధికారులు పలు బిల్డింగ్‌ల అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, ఇందుకు ఎంత ముడుపులు తీసుకున్నారో వెలికితీయాలని వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని నగరపాలిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఆయన కమిషనర్ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదవాళ్లకు చెందిన బంకులు తొలగిస్తున్నారని, పెద్దలు కట్టిన బిల్డింగ్‌లపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఎస్వీ థియేటర్ పక్కన జెండా కట్ట దగ్గర 25సెంట్లలో ఓ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని, 60 అడుగుల రోడ్డులో 10 అడుగులు కూడా రోడ్డుకు వదల్లేదని, ట్రాఫిక్ ఇబ్బంది ఉంటే ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. అలాగే వేణుగోపాల్‌నగర్ తారకరామ కొట్టాలలో నాలుగంతస్థుల భవనానికి అనుమతిచ్చారని, అప్రూవల్ లేఅవుట్ లేకుండా బిల్డింగ్ కడుతున్నారని అన్నారు. సప్తగిరి సర్కిల్ వైశ్యాహాస్టల్ పక్కన బిల్డింగ్ మార్ట్‌గేజ్ 10 అడుగులు ఉండాలని, అది లేకుండా నిర్మిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు. వీటికి ఎంత డబ్బు తీసుకున్నారో టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాధానం చెప్పాలన్నారు. విచారణ జరిపి ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్‌ను కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పిన్సిపాల్‌గా కవిత

శింగనమల జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పిన్సిపాల్‌గా జీ.కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రిన్సిపాల్‌గా ఉన్న మమ్మహద్‌షఫి రిటైర్డ్ అయ్యారు. దీంతో అనంతపురం ప్రభుత్వ కేఎస్ఎస్ జూనియర్ కళాశాలలో జీవ శాస్త్రం లెక్చరర్‌గా ఉన్న కవితను ఇక్కడి ప్రన్సిపాల్‌గా నియమించారు.

సకాలంలో రుణాలు రెన్యువల్ చేయాలి

అనంతపురంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): క్రాప్‌లోన్‌ను సకాలంలో రెన్యువల్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రామాంజనేయులు, మన్నీల గ్రామ రైతులు బ్యాంకు అధికారులను డిమాండ్ చేశారు. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో గల కెనరాబ్యాంకు మేనేజర్‌ను సోమవారం వారు ఈ మేరకు నిలదీశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. 40ఏళ్లుగా రైతులు బ్యాంకులో పంట రుణాలు తీసుకుంటున్నారని, ఏటా సకాలంలో రెన్యూవల్ చేసుకుంటున్నారని అన్నారు. అయితే ఈ ఏడాది ఫీల్డ్ ఆఫీసర్ నిర్లక్ష్యం కారణంగా రెవెన్యూవల్‌లో ఆలస్యం జరిగిందన్నారు. దీంతో రైతులకు అధిక వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గత పదిరోజులుగా క్రాఫ్‌లోన్ రెన్యూవల్ కోసం రైతులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ పద్ధతి మార్చుకుని రైతుల రెన్యూవల్ చేయాలని కోరారు. రైతులు గోపి, రమేష్, ఎల్లప్ప, వెంకటరామడు, సూరి, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



నార్పల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నూతన ఎంపీడీఓగా మమతా దేవి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఎంపీడీఓ గంగా దేవి సెలవుపై వెళ్లడంతో ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా భాస్కర్ విధులు నిర్వహించారు. ఇక సాధారణ బదిలీల్లో భాగంగా తనకల్లు ఎంపీడీఓగా ఉన్న మమతా దేవిని ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె గూగూడుకు వెళ్లి కుళ్లాయిస్వామిని, ఆంజనేయస్వామిను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేర్వేరుగా కులగణన చేయాలని వినతి

అనంతపురం అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఈడిగ, గౌడ్ కులస్థులకు వేర్వేరుగా కులగణన చేసేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను వినతి పత్రం సమర్పించారు. పలువురు మాట్లాడుతూ.. శెట్టిబలిజ, శ్రీశయన, యాత కులస్థులను వేర్వేరుగా కులగణన చేశారని తెలిపారు. ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపుల్లో ఐదు కులస్థులకు వేర్వేరుగా షాపులు కేటాయించారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈడిగ, గౌడ్ కులస్థులను వేర్వురుగా కులగణన చేసేలా ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లి న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఈడగ సంక్షేమ సంఘం రాయలసీమ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాసులు, ఈడిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం , సంఘం నాయకులు వెంకటేష్, నాగరాజు, లాలప్ప, గోపాల్, గంగాధర, నారాయణ స్వామి సూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో యోగాంధ్ర

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్కే యూనివర్శిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీలు యోగా ప్రాధాన్యత, అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీరామ్, అధ్యాపకులు కేశవులు, జితేంద్ర, శివశంకర్, జయరామప్ప, భాస్కర్, శ్రీనివాసులు, క్రీడాకారులు, నగరవాసులు తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న నగరవాసులు

వచ్చే రంజాన్ నుంచి తోఫా

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
● మసీదు, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

అనంతపురం కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వచ్చే రంజాన్ నుంచి ముస్లింల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రంజాన్ తోఫా పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని అశోక్‌నగర్‌లో రూ.65లక్షల వ్యయంతో నిర్మించిన అబ్దుల్ రహీమ్ ఖాద్రి మసీదు, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత వారు మసీదులో ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదు, షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దగ్గుపాటి మాట్లాడుతూ... ఏడు నెలల క్రితం ఇదే మసీదుకు తాను భూమిపూజ చేశానని తెలిపారు. ఇప్పుడు ప్రారంభోత్సవం కూడా తన చేతులమీదుగా జరగడం ఆనందంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక హజ్ యాత్ర, దుల్హన్ పథకం, షాదీఖానాలకు సహకారం అందిస్తున్నామన్నారు. వచ్చే రంజాన్ నుంచి తోఫా కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నగరంలో మొత్తం 125 మసీదులున్నాయని, అక్కడ అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతుగా సహకరిస్తానని అన్నారు. కబరస్థాన్‌లో రూ. కోటి వ్యయంతో ప్రహరీ, వీధి లైట్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నగరంలో ముస్లింలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ కాలవ మాట్లాడుతూ... ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో శ్రమిస్తోందన్నారు. ముస్లింల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అనంతరం రాష్ట్రంలోనే సీనియర్ ముతవల్లి అయిన కేఎం షఫీవుల్లాను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి ముతవల్లిలు, మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.



మసీదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

● సీపీఐ నాయకుల డిమాండ్
● తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

అనంతపురంరూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం పార్టీ నగర, రూరల్ మండల కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. నగరకార్యదర్శి శ్రీరాములు, రూరల్ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. ఈసందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామీణ ప్రాంతాల్లో వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పారన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేస్తామన్నారని, అయితే నేటికీ ఆ హామీలు అమలు కాలేదని వాపోయారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నా అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు పెట్టుబడి సాయం రైతులకు అందలేదన్నారు. స్కూళ్లు ప్రారంభమవుతున్నా తల్లికి వందనం పథకంను అమలు కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే వాటన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్లకు వేర్వేరు గా అర్జీలు అందజేశారు. నాయకులు వన్నారెడ్డి, నగేష్, పద్మావతి, రామాంజనేయులు, రాము, ధనుంజయ, అక్కులప్ప, వెంకటరాముడు, నరసింహులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

●కనగానపల్లి: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, రైతుసంఘం నాయకులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బెల్లం మహాదేవ, నాయకులు బాలరాజు, ఆదెప్ప, గోవిందు, మాదన్న పాల్గొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, రైతుసంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం హామీలను ప్రభుత్వం అమలు చేయాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు ముత్యాలప్ప, రామ్మోహన్ పాల్గొన్నారు.



అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద . ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

●నార్పల: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి సాకే గంగాధర్, సహాయ కార్యదర్శి సుధాకర్, నాయకులు నాగరాజు, నారాయణప్ప, రాజు, ఉమాపతి, సుందరమ్మ, అనిత తదతరులు పాల్గొన్నారు.

●రాప్తాడు: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, నాయకులు చలపతి, దుర్గాప్రసాద్, మహమ్మద్‌రఫీ, పెద్దిరాజు, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ


శశిధరరెడ్డి

శింగనమల జూన్2 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఇందులో మండలంలోని సి.బండమీదపల్లికి చెందిన విద్యార్థి శెట్టిపల్లి శశిధరరెడ్డి ప్రతిభ చూపాడు. గ్రామంలో శెట్టిపల్లి నరసింహారెడ్డి, రమణమ్మ దపంతుల కుమారుడు శశిధరరెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 638 వ ర్యాంకు సాధించాడు. ఇందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆస్తి పన్ను పెంచే సర్వేలను వ్యతిరేకించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ఆస్తిపన్ను 20శాతం పెంచేందుకు అధికారులు చేపడుతున్న సర్వేలను ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీలు పెంచమని, నాణ్యమైన విద్యుత్ అందిస్తామని, స్మార్ట్ మీటర్లు బిగించమని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం ప్రతి ఏడాది ఆస్తిపన్ను సంవత్సరానికి 15 శాతం ఆటోమెటిక్‌గా పెరిగేలా ప్రవేశపెట్టిన విధానాన్ని రద్దు చేస్తామని చెప్పారన్నారు. మరి ఇప్పుడేమో ఆస్తిపన్ను పెంచేందుకు చర్యలు చేపడుతుండడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఈ చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పన్ను పెంపుదలకోసం ఇళ్లవద్దకు సర్వే కోసం వచ్చే అధికారులను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సిటిజన్స్ ఫోరమ్ నాయకుడు ఏజీ రాజమోహన్, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ముత్తుజ, వెంకటనారాయణ, ప్రకాష్, గోపాల్, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులు బుల్లె రాజు, ఎన్టీఆర్ శీనా, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు

ర్యాలీని విజయవంతం చేయండి

నార్పల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈ నెల 4వతేదీన వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే వెన్నుపోటు దినోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్, సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ సమావేశ భవనంలో సోమవారం వారు కార్యకర్తల సమావేశం నిర్వహించి విషయం తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యులు శంకర్, గూగూడు రాజారెడ్డి పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై అవగాహన

నార్పల,జూన్2(ఆంధ్రజ్యోతి): వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చామలూరు, కేసేపల్లి రైతు సేవా కేంద్రాలలో సోమవారం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కే బార్గవి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పథకాలైన భూసార పరీక్ష ఫలితాలు, రాయితీ మీద విత్తన పంపిణీ, రాయితీ మీద వ్యవసాయ యాంత్రికరణ, అన్నదాత సుఖీభవ, సీఎం కిసాన్ పథకాల గురించి రైతులకు వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న పంటలలో చీడ పేడలు, వాటి సస్యరక్షణ గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే రెడ్డిపల్లి చందన, మండల వ్యవసాయ అధికారి చన్న వీరస్వామి, ఆత్మ బీటీఎం చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి జీ రాము, మాలతి, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నాపై ఎందుకు వివక్ష..?

● పార్టీకోసం కష్టపడితే కేసులు పెట్టిస్తారా..?
● గార్లదిన్నె పీఎస్‌లో టీడీపీ కార్యకర్త బైఠాయింపు

అనంతపురం(గార్లదిన్నె),జూన్ 2(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడుతున్న తనపై కక్ష సాధింపు చర్యలకు దిగారని ఆరోపిస్తూ టీడీపీ కార్యకర్త కనుంపల్లి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వ్యతిరేకంగా ప్లకార్డులు చేతబట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి బైఠాయించారు. కనుంపల్లికి చెందిన ప్రసాద్ కుటుంబం టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం రూ2కే మంచినీరు అందించేందుకు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ సుజల ప్రవంతి పథకాన్ని కనుంపల్లిలో ప్రసాద్ కుటుంబం నిర్వహించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే స్థానిక వైసీపీ నాయకులు స్వాధీనం చేసుకున్నారు. 2024లో టీడీపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగానే ప్రసాద్ తిరిగి తాగునీటి పథకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడే వివాదం మొదలైంది. తమకు తెలియకుండా వాటర్ ప్లాంట్‌ను ఎలా స్వాధీనం చేసుకుంటారని ఎమ్మెల్యే తల్లి బండారు లీలావతి ప్రసాద్‌ను ప్రశ్నించారు. దీంతో బండారు శ్రావణి గెలుపుకోసం గ్రామంలో వైసీపీ నాయకులతో గొడవలు పడ్డామని, కష్టపడి పనిచేశామని ప్రసాద్ అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు తమకే ఇవ్వాలని ప్రసాద్ పట్టుబట్టడంతో గొడవ ముదిరింది. సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యేపై ప్రసాద్ పలుమార్లు విమర్శలు చేశారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తల చేతనే తనపై అక్రమ కేసులు పెట్టించారని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినాయకత్వానికి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దాడి గురించి శింగనమల సీఐకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. కానీ ఎవరైన తనపై చిన్న ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పోలీసుల చర్యల వెనుక ఎమ్మెల్యే, ఆమె తల్లి హస్తం ఉందని ఆరోపించారు. తమ మండలంలో ఎమ్మెల్యే పర్యటన ఉందంటేనే చాలు తనను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని వాపోయారు. అందుకే న్యాయం కోసం నిరసనకు దిగానని తెలిపారు.



గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో బైఠాయించిన టీడీపీ కార్యకర్త కనుంపల్లి ప్రసాద్

తెగి పడిన 11కేవీ విద్యుత్ వైరు

● విద్యాదాఘాతంతో ఒకరికి గాయాలు


తెగిపడటంతో కాలిన విద్యుత్ వైరు

గార్లదిన్నె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరులో ఓ డాబా వద్ద 11కేవీ విద్యుత్ వైరు తెగి పడింది. కల్లూరు సబ్‌స్టేషన్ నుంచి సమీపంలోని వివిధ ఫ్యాక్టరీలకు విద్యుత్ సరఫరా అయ్యేందుకు 11కేవీ విద్యుత్ వైరును ఏర్పాటు చేశారు. అది డాబాలు, పెట్రోల్ బంకుల మీదుగా వెళ్లింది. అయితే సోమవారం సాయంత్రం ఓ డాబా పైన గాలికి ఉగుతూ ఆ వైరు తెగిపడడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో తమిళనాడకు చెందిన సెల్వరాజ్ అనే వ్యక్తి పక్కనే ఉండడంతో విద్యుత్‌షాక్ తగిలి గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైర్ తెగిన సమీపంలో పెట్రోల్ బంకు ఉందని, అయితే అదృష్టవశాత్తూ ఏ ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉందని, పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఆ లైన్‌ను పెట్రోల్ బంకులకు దూరంగా ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ సరఫరా చేయాలి

● ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య

అనంతపురం అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాలకు నాణ్యమైన విత్తన వేరుశనగ మాత్రమే సరఫరా చేయాలని ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య ఆదేశించారు. సోమవారం గుత్తిలోని పవన్ ఆగ్రో సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో విత్తన వేరుశనగ ప్రాసెసింగ్, నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పక్కాగా చేయడంతోపాటు వేరుశనగ మొలక శాతాన్ని పరిశీలించి, నాణ్యమైన విత్తన కాయలను సరఫరా చేయాలన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిటైర్డ్ సీఐకి ఎస్పీ సన్మానం

అనంతపురం క్రైం, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తూ రిటైర్డ్ అయిన చిన్నగౌస్ దంపతులను ఎస్పీ జగదీష్ సన్మానించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన సీఐ దంపతులకు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం చిన్నగౌస్ సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు పవన్‌కుమార్, బాబు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు సాకే త్రిలోక్‌నాథ్ పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్


డిపో ఆవరణలో పర్యటిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురం కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. స్థానిక బస్టాండ్, డిపో పరిసర ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులతో మాట్లాడుతూ... బస్టాండ్ ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బస్సులు నిర్దేశిత సమయాలకే రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బస్టాండు భవనాలు చేరుకుంటున్నాయని, నూతన భవనాల నిర్మాణంకోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ నూతన భవన నిర్మాణం జరిగేవరకూ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడా లన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా డస్ట్‌బిన్‌లలోనే వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత డస్ట్‌బిన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని తెలిపారు. బస్టాండు ఆవరణలోని దుకాణదారులు సైతం దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఓబులేసు, అనంతపురం డీఎం నాగభూపాల్, గుంతకల్లు డీఎం గంగాధర్, డిప్యూటీ ఈఈ సురేంద్ర బాబు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు మెరుగ్గా పని చేయాలి

అనంతపురం టౌన్, జూన్: ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుకు అధికారులందరూ మెరుగ్గా పని చేయాలని కలెకర్ వినోద్ కుమార్ ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఉపాధి పథకం కిందచేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల్లో పురోగతి చూపించాలన్నారు. కేటాయించిన పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తి చేయాలన్నారు. తాగునీటి పథకాలకు సంబంధించి రోజువారీగా రిపోర్టు అందించాలని సూచించారు. తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని రోజూ మానటరింగ్‌చేస్తుండాలన్నారు. పింఛన్లు, రేషన్ పంపిణీలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఇక రైతుసేవాకేంద్రాల్లో విత్త నాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకో వాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాల ని అధికారులకు ఆయన సూచించారు. లక్ష్యాలు ఎక్కడా పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు సరిదిద్దుకోవాలని ఆదేశించారు.

వైభవంగా సంగమ్మ గ్రామోత్సవం


సంగమ్మ, బీరప్పస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

గార్లదిన్నె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సంగమ్మ అమ్మవారి గ్రామోత్సవం సోమవారం రాత్రి కన్నులపండవగా జరిగింది. ప్రతి ఏడాది రెడ్డిసామాజిక వర్గం వారు కనగానపల్లి మండలం యలకుంట్ల నుంచి అమ్మవారిని గార్లదిన్నెకు తీసుకొచ్చి అంగరంగ వైభవంగా గ్రామోత్సవం జరుపుతారు. అందులో భాగంగా సోమవారం రాత్రి సంగమ్మ అమ్మవారిని తీసుకొచ్చారు. అమ్మవారితో పాటు ఇక్కడి కురుబ కులస్థుల కులదైవమైన శిలారమప్ప (బీరప్ప) స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని దర్శనం చేసుకుని మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గేటుక్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, రామచంద్రారెడ్డి, గట్టురామకృష్ణారెడ్డి, కొనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, రవిచంద్రారెడ్డి, నిరంజన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి

కూడేరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలకు పది రోజుల నుంచి తాగు నీటి సరఫరా కావడం లేదని, నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బోయవారివీధి, కమ్మవారివీధి, ఆంజినేయస్వామివీధి, ఎస్సీ కాలనీ .. తదితర ప్రాంతాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టారు. పది రోజులుగా సత్యసాయి, ఉరవకొండ ప్రాజెక్టులతో పాటు పంచాయతీ నీరు కూడా రావడం లేదని, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోనే వారే కరువయ్యారని వాపోయారు. దాదాపు గంట పాటు రోడ్డుపై వారు బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారికి నచ్చజెప్పారు. దీంతో మహిళలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.



ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు



బస్సులు రాకపోకల బోర్డును పరిశీలిస్తున్న కలెక్టర్

బస్టాండ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్, డిపో పరిసర ప్రాంతాలను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, నూతన బస్టాండ్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆరో ఆదోని కలెక్టర్‌కు తెలిపారు. ఆయన వెంట గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఓబులేసు, అనంతపురం, గుంతకల్లు డిపో మేనేజర్లు నాగభూపాల్, గంగాధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేంద్రబాబు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కణేకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ఉర్దూ భాష అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. స్థానిక జామియా మసీద్ ముతవల్లి ముర్షిద్‌పీర్‌ఖాద్రి ఆధ్వర్యంలో ఉర్దూ పద్యాలు, నమాజ్ సారాంశాలతో పాటు పలు విషయాలపై వేసవి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు నిర్వాహకులు నేమ్‌తుల్లాఖాద్రి, ఖాదీమ్‌పాషా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు షేక్‌గౌస్, ఫజుల్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డుల అందజేత



ఈ-శ్రమ్ కార్డులు అందుకున్న బీడీ కార్మికులు

తాడిపత్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక లేబర్ కార్యాలయంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు ఈ శ్రమ్ కార్డులను సోమవారం జారీ చేయించారు. డివిజన్ కన్వీనర్ ఉమాగౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో దాదాపు నాలుగు వేల మంది బీడీ కార్మికులు ఉన్నా.. లేబర్ కార్యాలయంలో వారి పేర్లు లేకపోవడం శోచనీయమన్నారు. ఇందులో నాయకులు రాంమోహన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తాడిపత్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో సోమవారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రామాంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా గురప్ప, ఉపాధ్యక్షుడిగా వద్ది చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరంగయ్య, మహిళా అధ్యక్షురాలిగా గోమతి.. మరి కొందరిని సభ్యులను ఎన్నుకున్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

కణేకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విజయసింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా గూడూరు మండల కార్యాలయంలో ఏఓగా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఏఓ బదిలీ

శెట్టూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఏఓ శేషారెడ్డి నార్పల మండలానికి, జూనియర్ సహాయకుడు నరేంద్ర గార్లదిన్నె మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీఓ జిలానీ బాషా సోమవారం తెలిపారు. వజ్రకరూరు మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న శ్రీనివాసులును ఇక్కడ ఏఓగా నియమించారని, జూనియర్ సహాయకుడిగా ఇంకా ఎవరినీ నియమించలేదని తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నందలపాడు శ్రీరాముల దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామిరెడ్డి, గూడా రంగనాథరెడ్డి, చిట్టిబాబు, ఆదినారాయణరెడ్డి, రంగనాథరెడ్డి, రాజారెడ్డి, దేవనాథ్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కాశీపురం జట్టు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న కాలవ భరత్

రాయదుర్గం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం గ్రామంలో నిర్వహించిన కేసీఎల్-2 క్రికెట్ టోర్నమెంట్‌లో కాశీపురం జట్టు విజేతగా నిలిచింది. సోమవారం నిర్వహించిన కేసీఎల్-2 మండల స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో కాశీపురం - కెంచానపల్లి జట్లు తలపడ్డాయి. కెంచానపల్లి జట్టు 12 ఓవర్లలో 39 రన్నులు చేయగా.. కాశీపురం జట్టు ఆరు ఓవర్లలోనే 40 రన్నులు చేసి విజయం సాధించింది. కాశీపురం జట్టుకు విన్నర్ ట్రోఫీతో పాటు రూ. 30 వేలును, రన్నరప్‌గా నిలిచిన కెంచానపల్లి జట్టుకు రూ. 15 వేలు నగదును ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, టీడీపీ నాయకులు సోమశేఖర్, వీరేష్ స్వామి, మనోహర్‌నాయుడు, పానాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు జేసీపీఆర్ పరామర్శ



తాడిపత్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చెన్నైలో ఉంటున్న తెనంపేట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే తన మిత్రుడు మునిరత్నంను సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని.. ఆయన్ను కలిశారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి ఉన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన

యాడికి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటల సాగులో మెళకువలపై యాడికి, రాయలచెరువులోని రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం అవగాహన కల్పించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి పరీక్షలు చేయించుకొని.. ఎరువులు వాడినట్లయితే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ఎరువులకు బదులుగా పచ్చిరొట్ట ఎరువులను వాడినట్లయితే భూసారం పెరుగుతుందన్నారు. గ్రూప్ విధానం ద్వారా డ్రోన్‌ను 80శాతం రాయితీ ద్వారా ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీఎస్ సుధీర్, ఏఈఓ జహిరున్, రైతులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు : మండలంలోని మిడుతూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న పత్తిపంటను ప్రకృతి వ్యవసాయం స్టేట్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నవీన్ సోమవారం పరిశీలించారు. అంతర్ పంటల సాగు వలన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఆయన వెంట చౌడప్ప, ఎస్తేరు రాణి ఉన్నారు.



యాడికిలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

ప్రజా సమస్యలపై అదే నిర్లక్ష్యం

కుందుర్పి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. కుందుర్పి తహసీల్దార్ కార్యాలయం కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 21 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా... కేవలం తహసీల్దార్ శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఏఓ మహేష్ , హౌసింగ్ మారుతి మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అధికారులు ఎవరూ హాజరుకాలేదు.

● శెట్టూరు : శెట్టూరులో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్ వ్యవసాయాధికారి హెల్త్ సూపర్‌వైజర్, ఎంఈవో, ఆర్‌డబ్ల్యూజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖాధికారులు యథావిధిగా డుమ్మాకొట్టారు.

● కంబదూరు : తమ గ్రామానికి పొలాల్లో దారి ఉండేదని, సంవత్సరం నుంచి ఆ రహదారిని మూసి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కనీసం 108 వాహనం కూడా రాలేని దుస్థితి ఉందని జెల్లిపల్లి వాసు లు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని తహసీల్దారు బాలకిషన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సర్వేయర్, వీఆర్వోను పంపించి సమస్యను పూర్తి స్థాయి లో పరిష్కరిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

● కళ్యాణదుర్గం : మండలంలోని బోరంపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు దళితుల పట్ల వివక్షత చూపుతున్నారని ఆ గ్రామానికి చెందిన మాదిగ గోపాల్, హరిజన మల్లికార్జున, హరిజన రామాంజినేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆర్డీఓ వసంత్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం దళితులకు చౌక ధరల దుకాణాన్ని కేటాయించిందని, దీంతో కొంతమంది అధికారులతో కలిసి కుమ్మక్కై, తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

●కణేకల్లు : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వస తి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్, నాయకులు డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు.



కుందుర్పిలో ముగ్గురు అధికారులు మాత్రమే పాల్గొన్న దృశ్యం

● రాయదుర్గంరూరల్ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నాయకులు స్థానిక తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

● ఉరవకొండ : కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి, అధ్యక్షులు బాలరంగయ్య, రంగారెడ్డి తహసీల్దారు మహబూబ్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు.

● గుంతకల్లుటౌన్ : పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు.

● అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. గుంతకల్లులో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి ఆధ్వర్యంలో, తాడిపత్రిలో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో, రాయదుర్గంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప ఆధ్వర్యంలో, యాడికిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ ఆధ్వర్యంలో, గుమ్మఘట్టలో సీపీఐ తాలూకా ఇన్‌ఛార్జ్ నాగార్జున ఆధ్వర్యంలో, పెద్దవడుగూరులో సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో, విడపనకల్లులో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

న్యూస్ బాక్స్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఉరవకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌లో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్యారంకేశవానంద, రామాంజినేయులు, వీరేష్, రఫీ, గోపీ పాల్గొన్నారు.

సెక్టార్ మీటింగ్

ఉరవకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీవో కార్యాలయంలో ఏసీ డీపీవో ఎల్లమ్మ సోమవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సమయపాలన పాటించాలని, ప్రతిరోజూ పీపీ1, పీపీ2 కార్యక్రమాలు నిర్వహించాలని, యాపుల్లో లబ్ధిదారుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయ్ కుమారి, రబియా, తిరుపాల్‌బాయ్, రాజమ్మ పాల్గొన్నారు.

భాగవత సప్తాహం

యల్లనూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి రామాలయంలో భాగవత సప్తాహం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని శనివారం వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తామని రాయలసీమ భక్త సమాజ కన్వీనర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు.

యోగా సాధన

యాడికి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశభవనంలో అధికారులు సోమవారం యోగా సాధన చేశారు. ఎంపీడీఓ వీరరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



మల్లికార్జున (ఫైల్)

విడపనకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ సీనియర్ నాయకుడు బీవీ మల్లికార్జున సోమవారం ఉదయం గుండె పోటుతో మరణించాడు. ఆయన కళాజ్యోతి అభ్యుదయ సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనారోగ్యంతో ఉన్న మల్లికార్జున బళ్లారి ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. ప్రస్తుతం ఇంటిలో ఉన్న ఆయనకు సోమవారం ఉదయం గుండె పోటు రావటంతో నిద్రలోనే తుది శ్వాస వదిలారు. ఆయన మృత దేహానికి మండల టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

రేషన్‌షాప్ తనిఖీ

బొమ్మనహాళ్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో 29వ రేషన్‌షాప్‌ను తహశీల్దార్ మునివేలు సోమవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంచి.. సరుకులు అందజేయాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు నరసింహమూర్తి, యుగంధర్ ఉన్నారు.

చౌక ధరల దుకాణం ప్రారంభం

బెళుగుప్ప, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న గ్రామంలో ప్రభుత్వ చౌక ధరల దుకాణాన్ని తహసీల్దార్ షర్మిల సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్, వీఆర్వో వెన్నెల, ఏఎస్ఐ రామదాసు, టీడీపీ నాయకులు, యర్రిస్వామి, తిప్పేస్వామి, డీలర్లు రామాంజినమ్మ, రమేష్ పాల్గొన్నారు.

జేఈఈలో సత్తాచాటిన గుత్తి విద్యార్థి



నందకిషోర్

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌-2025 పరీక్షలో పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రఘురామ్ కుమారుడు వెంకటరాజా నందకిషోర్ జాతీయ స్థాయిలో 954 ర్యాంక్‌ను సాధించాడు. ఇతను విద్య తో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

రాయదుర్గం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి చంద్రకళ సోమవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, అంజనమ్మ, మహిళా పోలీస్ మణికుమారి, రెడ్స్ స్వచ్ఛందసంస్థ జిల్లా కోఆర్డినేటర్ జయమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుమ్మఘట్ట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం అనంతపురం సవేరా ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. గ్రామ సర్పంచ్ సదాశివ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రాయదుర్గం ఎమ్మెల్యే తనయుడు కాలవ భరత్ ప్రారంభించారు. ఇందులో టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, నాయకులు యశోధర, అంజి, రవిచంద్ర పాల్గొన్నారు.

అందుబాటులో ఏటీఎం సేవలు

యల్లనూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంక్‌లో ఏటీఎం ఏర్పాటు చేశామని మేనేజర్ క్రాంతికుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఏటీఎం తెరిచి ఉంటుందని, ఖాతాదారులు గుర్తించాలని కోరారు.

హామీలు అమలు చేయాలి : వైసీపీ

గుత్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వైసీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందులో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేషరెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్‌రెడ్డి, రంగరాజు పాల్గొన్నారు.

● యల్లనూరు : వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దిన పోస్టర్లను తిమ్మంపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పుట్లూరు : వెన్నుపోటు దినం పోస్టర్‌ను వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ స్థానిక ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి నివాసంలో సోమవారం విడుదల చేశారు. ఇందులో నాయకులు ప్రతాప్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాంమోహన్ పాల్గొన్నారు.



గుత్తిలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

క్రైం న్యూస్ ..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహమ్మద్ (ఫైల్)

పెద్దవడుగూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌హెచ్-44 గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని రాయచూరుకు చెందిన క్లీనర్ మహమ్మద్ (31) మరణించాడు. అనంతపురం నుంచి రాయచూరుకు ఐచర్ వాహనంలో డ్రైవర్ ఖలీల్ ఉల్ రెహమాన్, క్లీనర్ మహమ్మద్ బయలుదేరారు. డ్రైవర్ ఖలీల్ నిద్రమత్తులో అతివేగంగా వెళ్తూ ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహమ్మద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గుర్తు తెలియని వ్యక్తి

తాడిపత్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని యల్లనూరు రోడ్డు గేటు వద్ద ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. రైలు ఢీకొనడంతో అతను కోమాలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు రైల్వే ఎస్ఐ నాగప్పకు సమాచారం అందించారు. ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించి .. అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



విరిగిపడిన విద్యుత్ స్తంభం

బొమ్మనహాళ్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ క్రాస్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ విద్యుత్ స్తంభం సోమవారం సాయంత్రం పక్కనే ఉన్న పొలంలో కూలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రిప్ అయి.. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. స్తంభానికి ఉన్న వైర్లు రోడ్డుపై పడ్డాయి. దీంతో వాహనాదారులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

అందుబాటులో రేషన్ సరుకులు



రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

విడపనకల్లు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇక ప్రతి రేషన్‌కార్డుదారుడికి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు అందుబాటులో ఉంటాయని, తీరిక ఉన్న వేళలో వెళ్లి సరుకులు తీసుకోవచ్చని టీడీపీ మండల నాయకులు స్పష్టం చేశారు. స్థానిక రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీని వారు సోమవారం పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్నమారయ్య, సొసైటి మాజీ అధ్యక్షుడు భీమలింగప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి ముండ్లూరి శ్రీనివాసులు, నాయకులు హనుమంతు, సినిమా రామాంజినేయులు, రంగస్వామి, టి. రామాంజినేయులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్‌లో చేరిన ఎన్ఎంయూ నాయకులు

ఉరవకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ డిపోకు చెందిన ఎన్ఎంయూ నాయకులు కార్మిక పరిషత్‌లోకి చేరారు. స్థానిక డిపో ఆవరణంలో సోమవారం జోనల్ కార్యదర్శి పురుషోత్తం, రీజనల్ కార్యదర్శి వాసు దేవరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎంయూకి చెందిన 36 మంది కార్మిక పరిషత్‌లోకి చేరారు. దీంతో ఎన్ఎంయూకు భారీ దెబ్బ తగిలింది. అనంతరం డిపో కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటేశులు, అదనపు కార్యదర్శిగా మధుసూధన్, సహాయకార్యదర్శిగా మల్లేష్, కోశాధికారిగా నాగేంద్ర, పబ్లిసిటీ కార్యదర్శిగా గిడియన్, మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు డిపో మేనేజర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కార్మిక పరిషత్ నాయకులు అంజినేయులు, రాజేంద్రరెడ్డి, చంద్రశేఖర్, పరమేష్ పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌ను కలిసిన కమిటీ నూతన సభ్యులు